# తెగ తెంపులు

"మీతో ఒక విషయం మాట్లాడాలనుకుంటున్నాను ఆంటీ" అంది రమ్య, కుశల ప్రశ్నలయ్యాక.

"చెప్పు, సందేహిస్తావేమిటి?"అన్నాను.

"ఫోన్‌లో కాదు, స్వయంగా వచ్చి మాట్లాడతాను. మీరింట్లో ఉంటారా?" అంది. ఉంటాను అన్నాక, ఒక గంటలో వస్తున్నానని చెప్పింది.

రమ్య నా స్నేహితురాలు మాధవి పెద్ద కూతురు.

మాధవీ వాళ్ళూ బెంగుళూరులో ఉంటున్నారు ఇప్పుడు. ఇదివరకు హైదరాబాదులోనే ఉండేవారు. ఇక్కడ ఉంటున్నప్పుడే, దాదాపు రెండేళ్ళ క్రితం రెండో కూతురు మాన్య పెళ్ళయింది. మాన్య భర్తతో కలిసి అమెరికా వెళ్ళిపోయింది. తరవాత మాధవి భర్తకి ఉద్యోగంలో బదిలీ అయి, బెంగుళూరు వెళ్ళాల్సి వచ్చింది. వెళ్ళిన కొత్తలో ఒకటి రెండు ఉత్తరాలు రాసింది గాని, తరవాత బద్ధకించిందో, కొత్త మిత్రులతో కొత్త వ్యాపకాల్లో పడిందో మరి, ఉత్తరాలు రాయడం లేదు. నేనూ ఊరుకున్నాను. రమ్య కోసం ఎప్పుడైనా వాళ్ళు హైదరాబాదు వచ్చినప్పుడు కలుసుకుని కావల్సినన్ని కబుర్లు చెప్పుకోవచ్చులే అనుకున్నాను.

మాధవీ నేనూ చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం-రాజమండ్రిలో ఒకే చోట. మొదట మిడిల్ స్కూల్లోనూ, తరవాత హైస్కూల్లోనూ. వాళ్ళిల్లు కూడా మా ఇంటికి దగ్గరే. తీరిక సమయాల్లో కలిసి రకరకాల ఆటలు ఇంటిపట్టునే ఆడుకునేవాళ్ళం-వాళ్ళింట్లోనో, మా ఇంట్లోనో. తనకి స్కూల్ ఫైనల్ అయిపోయాక వాళ్ళ నాన్నగారు విశాఖపట్నానికి మకాం మార్చారు. అప్పటి నుంచి మా స్నేహం ఉత్తరాల ద్వారానే కొనసాగింది కొంతకాలం. మా ఇద్దరి పై చదువులూ, పెళ్ళిళ్ళూ అయ్యాక మళ్ళీ హైదరాబాదులో కలుసుకున్నాం.

మా స్నేహం కొనసాగింది-అప్పుడప్పుడు కలుసుకోవడం ద్వారా. మాకు పిల్లలు పుట్టడం, వాళ్ళు పెద్దవాళ్ళవడం-చదువు సంధ్యలూ, పెళ్ళిళ్ళూ అన్ని సందర్భాల్లోనూ నేనూ మాధవీ కలుసుకోవడం, కష్టసుఖాలు చెప్పుకోవడం జరుగుతూనే ఉంది. బెంగుళూరు మమ్మల్ని మళ్ళీ విడదీసే వరకూ.

రమ్య మిట్టమధ్యాహ్నం ఎండలో వచ్చిందేమో, వస్తూనే సోఫాలో కూలబడి, "కాసిని మంచి నీళ్ళియ్యండి ఆంటీ" అంది తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకుని.

మంచి నీళ్ళు పట్టుకొచ్చి ఇచ్చి, "ఒంట్లో బావుందా?" అన్నాను.

"ఒంట్లో బాగానే వుంది. మనస్సే బాగా లేదు" అంది గంభీరంగా.

"మనస్సు దేముంది, మనం ఎలా చెబితే అలా వింటుంది" అన్నాను తేలిగ్గా నవ్వుతూ.

రమ్య నిటారుగా కూర్చుని, "మీరు ప్రతీదీ అంత తేలిగ్గా తీసుకుని ఎలా నవ్వుతూ ఉండగలరు? మీకెప్పుడూ సమస్యలు రావా?" అంది నిలదీస్తున్నట్లు మరింత గంభీరంగా.

"మనం వాటిని సమస్యలు అనుకోవడంలోనూ, వాటిని సమస్యలుగా తీసుకోవడంలోనూ ఉంటుంది. ఇంతకీ నీకిప్పుడొచ్చిన సమస్య ఏమిటి రమ్యా!" అన్నాను సౌమ్యంగా.

రమ్య వెంటనే సమాధానం చెప్పలేదు. నేను కూర్చున్న చోటు నుంచి లేచి, రమ్య పక్కన కూర్చుని భుజం మీద చెయ్యి వేశాను ఆప్యాయంగా. "శేఖర్ కులాసాగా ఉన్నాడా? మీ ఆయన ఎలా ఉన్నాడు? అమ్మా వాళ్ళూ ఫోన్‌లో మాట్లాడుతున్నారా? ఉత్తరాలు రాయడం ఇప్పుడెవరికీ అలవాటు లేదుగా!" అన్నాను.

"అమ్మా వాళ్ళ మాటెత్తకండి. నా మనస్సు విరిగి పోయింది" అంది రమ్య మొహం గంటు పెట్టుకుని.

"ఏమిటీ! నీ మనస్సు అంత పెళుసుగా ఉందా-విరిగిపోయేటంతగా?! ఏమో మరి, నా మనస్సు ఎప్పుడూ మెత్తగా సాగుతూ ఉంటుంది" అన్నాను చిరునవ్వుతో.

"అదుగో, మళ్ళీ మీరు-ప్రతీదీ వేళాకోళమేనా మీకు?" అంది చనువుకొద్దీ విసుక్కుంటూ.

"ఇంతకీ ఏమిటమ్మా రమ్యా నీ సమస్య? మీ అమ్మా వాళ్ళతో ఏమిటి సమస్య?" అన్నాను కొంచెం గంభీరంగా.

"వాళ్ళకెంత పక్షపాతం చూడండి. మొదటి నుంచీ అంతే. మాన్యని చూసినట్లు నన్ను చూడరు. సొంత పిల్లల పెంపకంలోనే ఇంత పక్షపాతం చూపిస్తుందా ఏ తల్లి అయినా?" అంది నిష్ఠూరంగా.

"అదేమిటి? మీ ఇద్దరూ ఏది కోరుకుంటే అది చేశారు కదా. ఇద్దరికీ పెళ్ళిళ్ళయి నీకో కొడుకు. అన్ని ముద్దు ముచ్చట్లూ జరుపుతూనే ఉన్నారు కదా-నాకు తెలిసిన వరకు?" అంటూంటే నా మాటల కడ్డొచ్చి-

"అవును, మీకు అంతే తెలుసు. పైపైన చూసే వాళ్ళకి లోతుపాతులు తెలియవు" అంది రమ్య.

"అంత లోతైన విషయాలు నాతో చెప్పుకోదగినవే అయితే, చెప్పు, తెలుసుకుంటాను. అంత దూరం నుంచి ఎండలో వచ్చింది అందుకే అనుకుంటాను, చెప్పు" అన్నాను.

"మా ఆయన్ని కెనడా పంపిస్తున్నారు వాళ్ళ కంపెనీ వాళ్ళు. ఆయనతో కలిసి నాకూ వెళ్ళాలని ఉంది. కానీ బోలెడు ఖర్చవుతుంది. "మీ నాన్నగారిని అడుగు" అన్నారీయన. కానీ నాన్నగారు ఒప్పుకోలేదు. ఆయన దగ్గర డబ్బు లేదన్నారు. పిల్లవాణ్ణి అమ్మ దగ్గర అట్టే పెట్టుకోమన్నాను కొన్నాళ్ళపాటు. అమ్మ ఒప్పుకోవడం లేదు" అంది రమ్య.

"ఎన్నాళ్ళపాటు అట్టే పెట్టుకోవాలి? ఎందుకొద్దంది మీ అమ్మ?" అని అడిగాను.

"కనీసం ఒక ఆరు నెల్లయినా ఉండాలి. పరిస్థితి బావుంటే ఇంకా ఎక్కువ కాలం ఉండొచ్చు. అమ్మకిప్పుడు ఏ బాదరా బందీ లేదుకదా. శేఖర్‌ని అట్టే పెట్టుకోవచ్చుకదా అంటే, కుదరదంటోంది" అంది రమ్య విసుగ్గా మొహం పెట్టి.

"ఏం, ఎందుకు కుదరదంది?" అని అడిగాను సహజంగానే కుతూహలంతో.

"మాన్య కడుపుతో ఉందిట. దాని పురిటికి తను అమెరికా వెళ్ళాల్సి వస్తుందిట. మీ వాణ్ణి నా దగ్గర వదిలేస్తే ఎలా? జ్ఞానం తెలుస్తున్న పసివాణ్ణి ఇంకొకరి దగ్గర వదిలేసి వెళ్ళడం మంచిదికాదు అని నీతులు చెబుతోంది."

"మాన్య పురిటికి మీ అమ్మ వెళ్ళడం ముఖ్యమే కదా," అన్నాను మాధవిని సమర్థిస్తూ.

"ఎందుకు ముఖ్యం? ఏం, మాన్య వాళ్ళత్త గారిని పిలిపించుకోవచ్చుకదా. మా అత్తగారు బతికుండి ఉంటే నాకీ సమస్య లేక పోవును. మా మామగారు వాళ్ళ పెద్దబ్బాయి దగ్గర ఉంటున్నారు. వాళ్ళ దగ్గర మా వాణ్ణి ఎలా వదిలేస్తాం?" అంటూ తన ఇబ్బందులన్నీ చెప్పుకొచ్చింది రమ్య.

"మాన్య అత్తగారికి నిజంగానే వీలుకాదేమో, ఎవళ్ళ సమస్యలు వాళ్ళకుంటాయికదా" అన్నాను, అర్థం చేసుకోమన్నట్లుగా.

"అవును! వాళ్ళ అత్తగారు భర్తని వదిలి వెళ్ళలేదుట! ఆవిడకి తన మొగుడు ముఖ్యం. మా అమ్మకి చిన్న కూతురు పురుడు ముఖ్యం. నా కష్ట సుఖాలు ఎవరికీ అక్కర్లేదు. నేను ఎవరితో చెప్పుకోను?" అంది గద్గద స్వరంతో.

"పోనీ, మీ అమ్మతో నన్ను మాట్లాడమంటావా?" అన్నాను మాట వరసకి.

"అందుకే కదా మీ దగ్గరికి వచ్చాను. మీరు ఫోన్ చేసి అమ్మతో మాట్లాడి చూస్తారా?" అంది ప్రాధేయపడుతూ.

నా దగ్గరున్న నంబరు సరియైనదా కాదా అని రమ్యని అడిగి, ఆ నంబరుకి చేశాను. ఆశ్చర్యపోయింది మాధవి నా గొంతు విని. నేను రమ్య విషయం ఎత్తేసరికి, "రమ్య నీ దగ్గర కొచ్చిందా?" అని అడిగింది. "అవును, ఇక్కడే ఉంది" అన్నాను. "ఫోన్ దాని చేతికియ్యి" అంది. ఇచ్చాను. ఏం మాట్లాడిందో తెలియదు. ఠక్కున ఫోన్ పెట్టేసింది రమ్య. ముఖం కోపంతో ఎఱ్ఱబడింది.

కాస్సేపు మౌనంగా కూర్చున్న తరవాత, "పోనీ ఈసారికి మీ ఆయన్ని ఒక్కణ్ణే వెళ్ళమను. నువ్వు పిల్లవాడితో ఇక్కడే ఉండి, మీ అమ్మ అమెరికా నుంచి తిరిగి వచ్చాక అప్పుడు ఏదో ఏర్పాటు చేసుకోవచ్చు కదా" అన్నాను మధ్యే మార్గంగా.

"ఏమిటాంటీ? నేను ఒక్కర్తెనీ చిన్న కుఱ్ఱాణ్ణి పెట్టుకుని ఇక్కడ పడి ఉండాలా? అక్కడ మాన్య అమెరికాలో మొగుడితో హాయిగా ఉంటే, నేనిక్కడ ఒంటరిగా ఏడుస్తూ ఉండాలా?" అంది రమ్య ఏడుపు గొంతుతో.

"ఎందుకంత బెంబేలు పడిపోతావు రమ్యా? చదువుకున్నదానివి, హాయిగా ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవచ్చు. పిల్లవాడితో సరదాగా కాలం గడపొచ్చును. అక్కడ మీ ఆయన ఆఫీసు పనితో తీరిక లేకుండా తిరుగుతూంటే, ఫ్లాట్‌లో ఒక్కర్తెవీ ఉండాలి కదా, పిల్లవాడు గుర్తుకొచ్చి మరింత బాధపడతావు" అంటూ అనునయంగా చెప్పాను.

"మీ రందరూ మాన్య పక్షమే. నేనెలా ఏడ్చినా ఫరవాలేదు. అక్కడ దానికేం లోటు? అమెరికాలో అన్ని సదుపాయాలూ ఉంటాయి. మాన్య ఏ ఉద్యోగమూ వెలగబెట్టడం లేదక్కడ. ఏం, ఇంట్లో ఉండి చంటి పిల్లాణ్ణి చూసుకోలేదా? అక్కడికీ ఫోన్ చేసి చెప్పాను. నేను కెనడా వెళ్ళే విషయం. అదేం పట్టించుకోలేదు. పైగా, "అమ్మ లేకపోతే నాకు భయమేస్తుందే. పురిటికి నువ్వా అమ్మ దగ్గరకొచ్చావు కదుటే. అయిదో నెల వచ్చే వరకూ అమ్మ దగ్గరే ఉన్నావు. ఇప్పుడు నేను అమెరికాలో ఉన్నాను కాబట్టి, అమ్మ ఇక్కడికి రావల్సివస్తోంది. అమ్మ దగ్గర లేకపోతే నాకు భయం వేస్తుందే" అని నంగనాచిలా కబుర్లు చెబుతోంది. నేనిక్కడ ఒక్కర్తెనీ పిల్లాణ్ణి పెట్టుకుని ఉండాలంటే ఎంత కష్టం! నాకు మాత్రం భయంగా ఉండదా?" అంటూ వాదించింది రమ్య.

"పోనీ, పిల్లవాణ్ణి కూడా కెనడా తీసుకు వెళ్తే సమస్యే ఉండదు కదా" అన్నాను.

"అంత ఖర్చు భరించడం ఎలా? నా టిక్కెట్టు వాటికే నాన్నా వాళ్ళని సాయం అడగమన్నారు మా ఆయన. నాన్నగారు కుదరదన్నారు. నా పెళ్ళికి బోలెడు ఖర్చు చేశారుట. మాన్య పెళ్ళికి చేసిన అప్పు తీర్చడం ఇప్పుడిప్పుడే పూర్తి అయిందిట. కట్నం తీసుకోవడంలేదని చెప్పి, పెళ్ళి "ఘనంగా" చెయ్యమన్నారని లక్షలు ఖర్చు పెట్టారు. మాన్య కోసం ఎంతయినా ఖర్చు పెడతారు. నా దగ్గరకొచ్చేసరికి ఎందుకంత వెనకాడటం? నేను కాస్త నల్లగా ఉన్నానని కట్నం ఎక్కువ ఇవ్వాల్సి వచ్చిందిట. నల్లగా పుట్టడం నా తప్పా? మాన్య ఎర్రగా ఉందని మొదటి నుంచీ దాన్ని గారాబం చేసి నెత్తికెక్కించుకున్నారు", అంటూ నిష్ఠూరాలు వేస్తూ పోతూంటే వినలేకపోయాను.

"ఏమో రమ్యా, నువ్వు అనవసరంగా బాధ పడుతున్నావనిపిస్తోంది. మాధవి ఎప్పుడూ మీ విషయంలో అలాంటి వివక్ష చూపించలేదు" అన్నాను.

"అవును, అదే అమ్మ గడుసుతనం. మాన్య ఎప్పుడూ తనకి నెత్తిమీద దేవతే. ఇన్నాళ్ళూ సహించాను. ఇప్పుడు నా మనస్సు విరిగిపోయింది. మాన్యకీ నాకూ ఏ సంబంధం లేదనుకుంటాను. నాకు వాళ్ళెవరూ అక్కర్లేదు" అంది రమ్య ఉక్రోషంతో.

రమ్య ఎంత మూర్ఖంగా ఆలోచిస్తోందో స్పష్టమైంది. తన మనస్సు ఆంతర్యాన్ని తను గ్రహించలేకపోతోంది. తను ఎంత సంకుచితంగా, స్వార్థ పూరితంగా ఆలోచిస్తోందో తెలుసుకోలేక పోతోంది. అయినా, ఆ భావాన్ని వ్యక్తం చెయ్యకుండా –

"రమ్యా, నువ్వు అమాయకంగా ఆలోచిస్తున్నావ్! ముందు నీ మనస్సులోని ఆలోచనల్ని గమనించు, అర్థం చేసుకో. తెగతెంపులు చేసుకోవాల్సింది నీలోని అసూయతోనూ, కోపంతోనూ, ద్వేషంతోనూ. అంతే కాని, మనుషులతో ఉండే బంధాలతో కాదమ్మా"! అన్నాను.

"ఊరికే వేదాంతం చెప్పకండి అంటీ. నాకు ఒళ్లు మండుతుంది" అంది రమ్య.

"వేదాంతం వేరూ జీవితం వేరూ కాదమ్మా. అది కేవలం ముసలివాళ్ళ జీవితాలకీ, వాళ్ళ మోక్షానికీ సంబంధించినది అనుకోకు. ప్రశాంతంగా జీవించడం కోసమే వేదాంతం. నిదానంగా ఆలోచిస్తే నీకే తెలుస్తుంది" అన్నాను చివరికి, రమ్య బుర్రకి ఎక్కినా ఎక్కకపోయినా.

(స్వప్న, జూన్ 2009)